క్లుప్తంగా

పూడికల తొలగింపు



కాలువలో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య కార్మికురాలు

మల్కాపురం : 61వ వార్డు పరిధి మల్కాపురం పల్లివీధి, గొల్లవీధి, గాంధీజీ వీధి తదితర ప్రాంతాలోని వీధి కాలువల్లో పూడికలు పేరుకు పోయాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను స్థానికులు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ దృష్టికి శుక్రవారం తీసుకువెళ్లటంతో స్పందించిన ఆమె వార్డు హెల్త్ అసిస్టెంట్ రవికి సమస్య వివరించారు. వెంటనే పూడికలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం పారిశుధ్య సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పూడికలు తొలగించారు.

గెడ్డలో పూడికల తొలగింపు



గెడ్డలో పూడికలు తొలగిస్తున్న సూపర్‌వైజర్లు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్ నగర్ వద్ద గెడ్డలో పూడికలు చెత్త పేరుకు పోయింది. మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం పారిశుధ్య సూపర్‌వైజర్లు పూడికలు తొలగించే చర్యలు చేపట్టారు. అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లు డి. శ్రీనివాసరావు, గణేష్, ఎస్ఎస్ రమణ గెడ్డ కల్వర్టు కింద పేరుకు పోయిన చెట్ల కొమ్మలు, వ్యర్థాలను తొలగించారు. మురుగు నీరు తొలగిపోవడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గ్రామదేవత వార్షికోత్సవాల కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న పొట్టిమూర్తి, నమ్మి గౌరీశ్వరరావు తదితరులు

మల్కాపురం : 59వ వార్డు హిమాచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి ఆలయ 41వ వార్షికోత్సవం మే 11వ తేదీన నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు, సినీ నటుడు పొట్టిమూర్తి, గ్రామాధ్యక్షుడు గాలి సన్యాసిరావు, న్యాయవాది కోలా వెంకటరమణ తదితరులు విడుదల చేశారు. మందిరం వద్ద శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ గౌరీశ్వరరావు మాట్లాడుతూ మే 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా పలు ఆధ్యాత్మికత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, వివిధ గ్రామాల పెద్దలు పాల్గొంటారన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



కళాశాలలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోపాలపట్నం: నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్ కళాశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ ప్రారంభించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కళాశాల సిబ్బందికి బీపీ షుగర్, ఈసీజీ వంటి పలు రకాల పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో 150 మంది పాల్గొన్నారు.

పరిధి దాటారు!

- జోన్–6 అధికారుల తీరుపై కార్పొరేటర్ అసంతృప్తి
- కనీస సమాచారం ఇవ్వక పోవడంపై నిలదీత
- కౌన్సిల్‌లో ప్రస్తావించనున్నట్లు వెల్లడి



ఆంజనేయస్వామి ఆలయం నుంచి పెంటమాంబ ఆలయం వరకు చేపట్టిన కాలువ పనులు

మల్కాపురం: తమ పరిధి కాదు.. కనీసం వార్డు కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వలేదు. అయినా దర్జాగా పనులు చేపట్టారు. దీంతో జీవీఎంసీ జోన్–6 ఇంజినీరింగ్ అధికారుల తీరుపై 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై కౌన్సిల్‌లో ప్రస్తావించనున్నట్లు వెల్లడించారు.

ఇదీ పరిస్థితి

జోన్–5 పరిధిలో జోన్–6 అధికారులు కాలువ పనులు చేపట్టారు. జింక్ గేటు నుంచి గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు సర్వీసు రోడ్డులో ఫుట్‌పాత్‌కు మధ్య సుమారు రూ.13 లక్షల వ్యయంతో కాలువ పనులు జోన్–6 (గాజువాక నియోజక వర్గం) వర్క్స్ అధికారులు చేపట్టారు. విషయం తెలుసుకున్న 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య తన వార్డు పరిధిలో తనకు సమాచారం లేకుండా పనులు చేపట్టడం ఏంటని వారిని ప్రశ్నించారు. ఇందులో తమ ప్రమేయం లేదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్టు కార్పొరేటర్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అభివృద్ధి పనులు మంచిదే కానీ కనీసం తనకు సమాచారం ఇవ్వాలనే ఆలోచన లేకపోవడం చూస్తే, కార్పొరేటర్ అంటే అధికారులు ఎంత చులకనభావంతో ఉన్నారో అర్థమవుతోందని ఆమె ఆగ్రహించారు.దీనిపై కౌన్సిల్‌లో మాట్లాడుతానని స్పష్టం చేశారు.



జింక్ గేటు నుంచి పెంటమాంబ ఆలయం వరకు చేపట్టిన కాలువ పనులు

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఎన్నాళ్లయినా పోరాడతాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులు

సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు బీజేపీ ప్రభుత్వం ప్రకటించే వరకు ఎన్ని సంవత్సరాలైన ఉద్యమం కొనసాగిస్తామని జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల గురజాడ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జగ్గునాయుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటం వృథా కాలేదన్నారు. రెండు సంవత్సరాలు పూర్తి అయినా మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందన్నారు. ఇది కార్మికులు, ప్రజలు చేసిన పోరాట ఫలితమే అన్నారు. మోదీ ప్రభుత్వం మెడలు వంచి స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిలిపేసే వరకు ఈ పోరాటం సాగుతుందన్నారు. ప్లాంట్‌కు ముడి ఖనిజం, బొగ్గు, రైల్వే ర్యాక్స్, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వకుండా ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తుందని మండిపడ్డారు. అనంతరం ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు, డప్పు కళాకారుల నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల యూనియన్ నాయకులు, అసంఘటిత రంగ కార్మికులు, వైస్ చైర్మన్ పడాల రమణ, బి.నాగభూషణరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఎస్.కనకారావు, కె.లోకనాథం, వై.నాయినబాబు, కె.సుధాకర్, సత్యవతి, యుఎస్ఎన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం



కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న

గోపాలపట్నం: బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలులో కుట్టు శిక్షణ తరగతులను 91వ వార్డు కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వావలంబన సాధించేందుకు ఇలాంటి శిక్షణ శిబిరాలు దోహదపడతాయన్నారు. జనశిక్షణ సంస్థాన్ సహకారంతో శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, మనోహర్, అంబేడ్కర్ సేవాసమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో సొసైటీ కార్మికుడి మృతి



నెలల కుమారుడితో మృతుడు రవి (ఫైల్)

మల్కాపురం: అంత వరకు విధులు నిర్వహిస్తున్న కార్మికుడు ఒక్కసారి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో చికిత్స కోసం తరలించగా కొంత సమయానికే మృతి చెందాడు. దీంతో తోటి కార్మికులు, మృతుడి బంధువులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వివరాలు.. హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లోని మాజీ సొసైటీలో రవి (42) కొన్నేళ్లుగా పని చేస్తున్నాడు. రోజూ మాదిరి గానే శనివారం రవి తను పని చేస్తున్న బాండ్‌స్టోర్‌లో పని చేసుకుంటున్నాడు. అయితే మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఛాతిలో నొప్పిగా ఉందని తోటి కార్మికుడి సాయంతో సంస్థ ఆవరణలోని ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం ఈఎస్ఐ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. నొప్పితోనే ఆస్పత్రి నుంచి తన డిపార్ట్‌మెంట్ వరకు రవి నడిచి వెళ్లడంతో నొప్పి మరింత ఎక్కువ అయ్యి నోటి నుంచి నురగలు వచ్చి డిపార్ట్‌మెంట్ వద్ద కుప్పకూలిపోయాడని సొసైటీ యూనియన్ ప్రతినిధులు చెప్పారు. ఇలా కుప్పకూలిపోయిన రవి కొద్ది క్షణాల్లో మృతి చెందాడు. దీంతో యూనియన్ ప్రతినిధులు శివారెడ్డి తదితరులు ఆందోళన చేశారు.మృతుడు కుటుంబానికి న్యాయం చేయాలని, రూ. 15 లక్షల సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని అధికారులు యూనియన్ ప్రతినిధులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సంతోషం నిలవలేదు

రవికి వివాహం అయిన చాలా ఏళ్ల తర్వాత కొద్ది నెలల కిందట బాబు పుట్టాడు. దీంతో ఎంతో ఆనందంగా ఉండేవాడు అయితే ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు.

ఎనస్తీషియాలజీపై రెండు రోజుల కార్యక్రమం



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : ఎనస్థీషియాలజీ విభాగం ఆధ్వర్యంలో పీజీ ఇంపాక్ట్–2023 ఎకడమిక్ ప్రోగ్రాం నగరంలోని ఏఎంసీలో నిర్వహించారు. ఎనస్తీషియా విభాగం, ఆంధ్రా మెడికల్ కాలేజీ, ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియాలజీ (ఐఎస్ఏ–ఏపీ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించనున్నాయి. తొలిరోజు శనివారం ఈ కార్యక్రమానికి మొత్తం 250 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి నిపుణులు హాజరయ్యారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీజీలకు క్విజ్ నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. అశోక్‌కుమార్, పరిశీలకురాలు డాక్టర్ కె.శిల్ప, ఏపీ మెడికల్ కౌన్సిల్, ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వి.రవి, చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ. ప్రశాంతి, సెక్రటరీ డాక్టర్ అచ్యుతరామయ్య, ఐఎస్ఏ నేషనల్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె. కుచేలబాబు, డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు, డాక్టర్ కేఆర్ఎస్‌ఠాగూర్, అధ్యాపకులు, ఎనస్తీషియాలజీకి చెందిన దాదాపు 225 మంది పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: హైదరాబాద్‌కు చెందిన శ్రీకృష్ణ స్వర రాగ స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో స్వరరాగ గంగా ప్రవాహమే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత వై.ఎస్. రామకృష్ణ పాడిన స్వర రాగ గంగా ప్రవాహమే, శైలజతో కనుపాప కరువైన, సాయి మేఘనతో మురిపించే అందాలే, శివ రామకృష్ణ, సాయిమేఘన పాడిన ఓహో మోహన రూపా పాటలు అలరించాయి. నూకల రామ నరసింహం, మేఘన, తుషార నిలయ పాడిన జగదానంద కారక, గంటి రామకృష్ణ, ఉమా గోపాల్ పాడిన హలో హలో ఓ అమ్మాయి, మహమ్మద్ ఖాన్, వీణ పాడిన అమ్మో నీ రేగు పల్లు, సుబ్రహ్మణ్యం పాడిన తిరుమల మందిర సుందర వంటి చక్కని గీతాలు ప్రేక్షకులకు వీనుల విందు చేశాయి. ఎస్.లలిత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సినీ నటుడు ప్రసన్నకుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాయకులను ఘనంగా సత్కరించారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

అదుపులో ఇద్దరు మైనర్లు

మల్కాపురం: సాధారణ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు ఇద్దరు మైనర్లు ద్విచక్ర వాహనంపై వస్తున్న తీరు అనుమానం కలిగించింది. దీంతో ఆ వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా వారి వద్ద ప్యాక్ చేసి ఉన్న రెండు కేజీల గంజాయి గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పూర్తి వివరాలు... స్థానికులైన ఇద్దరు మైనర్లు ద్విచక్ర వాహనం పై గాజువాక మార్గం నుంచి శ్రీహరిపురం వైపు వస్తున్నారు. అయితే వేగంగా ద్విచక్ర వాహనాలు నడిపే వారికి జరిమానాలు విధించే కార్యక్రమంలో భాగంగా మల్కాపురం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు శ్రీహరిపురం వద్ద శనివారం మధ్యాహ్నం గస్తీ చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తున్న మైనర్లను ట్రాఫిక్ పోలీసులు నిలిపారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడం.. వారి వెంట తెచ్చిన ప్యాకెట్ ఏంటి అని అడిగితే దాన్ని దాచే యత్నం చేశారు. దీంతో అనుమానం వచ్చిన లా అండ్ ఆర్డర్ పోలీసులు ఆ ప్యాకెట్ తెరిచి చూడగా రెండు కేజీల గంజాయి ఉంది. దీంతో గంజాయి ఎక్కడిది.. ఎవరు ఈ మైనర్లతో సరఫరా చేయిస్తున్నారన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.


భారీ అన్నసమారాధన

గోపాలపట్నం: శ్రీరామ నవమి సందర్భంగా గోపాలపట్నం ప్రధాన రహదారిలో రామాలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హిమాచల్‌నగర్‌లో విద్యుత్ సమస్యలకు చెక్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ సచివాలయం ప్రాంత వాసుల కరెంట్ కష్టాలు తీరనున్నాయి. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం వస్తుండడంతో కార్పొరేటర్ పుర్రెపూర్ణశ్రీ యాదవ్ సమస్యను శ్రీహరిపురం సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సుమారు రూ. 8 లక్షల వ్యయంతో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేయించారు. దీన్ని శనివారం సాయంత్రం వార్డు పార్టీ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ ప్రారంభించారు. దీంతో కాలనీ వాసులు తమ ఇక్కట్లు తీరుతాయని హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైబీ రాజేంద్రప్రసాద్

సీతంపేట : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం సమావేశం స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్పంచులు ఎవరూ విద్యుత్ బిల్లులు కట్టవద్దన్నారు. సర్పంచుల సంతకం లేకుండా 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. సర్పంచుల విధులు, నిధులు, అధికారాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ సర్పంచుల గౌరవ వేతనం రూ.15వేలకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణా సర్పంచుల సంఘం ప్రెసిడెంట్ వై.నాగేంద్ర మాట్లాడుతూ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా పర్యటించి సర్పంచుల విధులు, అధికారాలపై చైతన్య పరిచేలా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉత్తరాంధ్ర జిల్లాల సర్పంచులు పాల్గొన్నారు.

వివరాలు ఆన్‌లైన్ చేయాలి

మహారాణిపేట: కంచరపాలెం సమీపంలోని ఏఎస్సార్ నగర్, కప్పరాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను సందర్శించారు. ఈ–సంజీవనిని తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.

ఆల్ ద బెస్ట్

- పది విద్యార్థులకు శుభాకాంక్షలు
- మల్కాపురంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం



పదో తరగతి విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వద్ద గల జీవీఎంసీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ×ఆల్ ద బెస్ట్₹కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ పది పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించటమే ధ్యేయంగా శ్రమిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తమ పాఠశాల నుండి 276 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయనున్నట్లు వివరించారు. వరుసగా నాలుగేళ్ల నుండి తమ విద్యార్థులు పదికి పది సాధిస్తు, గ్రేటర్ పరిధిలో గల పాఠశాలల్లో మిన్నగా గుర్తింపు దక్కించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే రాణింపు

- మోటివేటర్ వేణుగోపాల్



మోటివేటర్ వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న విజయచైతన్య తదితరులు

గోపాలపట్నం: పిల్లల అభిరుచిని తల్లి దండ్రులు, గురువులు గమనించి ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తే రాణిస్తారని లైఫ్ స్కిల్స్ కోచ్ వేణుగోపాల్ అన్నారు. నవర బెహరా విద్యా సంస్థల్లో శనివారం లైఫ్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని బెహరా విద్యాసంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య ప్రారంభించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువుల పట్ల భయ భక్తులతో మెలగాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఏవిధంగా మెలగాలి, నిర్దిష్ట గమ్యాన్ని ఏర్పరుచుకోవడానికి గురువులు దోహద పడాలన్నారు. అనంతరం వేణుగోపాల్‌ను ఘనంగా త్కరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’కి కార్మిక నాయకులు



ఢిల్లీకి బయలుదేరిన కార్మిక నాయకులు

తాటిచెట్లపాలెం: ఢిల్లీలో ఈ నెల 5న జరగనున్న కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీకి విశాఖ నుంచి కార్మిక నాయకులు శనివారం ఉదయం సమతా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్లారు. సుమారు వంద మంది భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు తరలి వెళ్లారు. వీరికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు, కార్మిక చట్టాల తొలగింపు, కనీస వేతనం, కొత్త పెన్షన్ విధానం రద్దు కనీస మద్దతు ధర వంటి పలు అంశాలపై ఢిల్లీలో ర్యాలీ జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు తులసి, అప్పలరాజు, అనసూయ, నాయకులు బి.వెంకటరావు, శంకరరావు, దేవి, బృంద, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపట్నం: నేషనల్ ఏరోనాటిక్స్, స్పేస్ అడ్మిన్నిస్టేసన్(నాసా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమ్మేళనం(ఐఎస్‌డీసీ) నిర్వహించిన పోటీల్లో రవీంద్రభారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత, ఉపాధ్యాయులు శనివారంఅభినందించారు. పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 19 దేశాల నుంచి 24వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అందులో పాఠశాల ద్యార్థులు మూడో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఫ్రిస్కా, టెక్సాస్‌లో బహుమతులు అందుకోబోతున్నారని తెలిపారు.

ఆర్‌సీఎల్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ స్పోర్ట్స్: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌సీఎల్ లీగ్ క్రికెట్ పోటీలను పోర్ట్ స్టేడియంలో శనివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ టోర్నీలో ఏడు జట్లు పాల్గొంటుండగా ప్రారంభ పోటీల్లో తలపడుతున్న ఇరుజట్లను డిప్యూటీ మేయర్ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి లీగ్‌ల వల్ల క్లబ్‌ల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. పోటీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సమాజ సేవకు ఉపయోగించడం, అంధ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ రాజారెడ్డి, కిషోర్, విశ్వనాథం, మెదిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై చిన్నచూపు తగదు



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కార్మికులు శ్రమ ఎనలేనిదని, అటువంటి కార్మికులను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహారా దీక్షలు 779వ రోజుకు చేరుకున్నాయి. ఈ ఉక్కు రిలే నిరాహారదీక్షలో స్టీల్‌ప్లాంట్ చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ప్లాంట్ అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మిక వర్గం ఎంతగానో శ్రమించిందన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కేంద్రాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇతర పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బాలవాటికలో ప్రవేశాలు

గోపాలపట్నం: ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం బాలవాటిక–1లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్. ఆదిశేష శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 12 వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. బాల్వాడీలో చేర్పించేందుకు 3 ఏళ్లు నిండి 4 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు గడువు లోగా పాఠశాలలో అందించాలని తెలిపారు.